క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: మండలంలోని పనపాకం దోర్నకంబాల గ్రామానికి చెందిన వసంత్ కుమార్, సుప్రజకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పనల నాగరాజు నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, సర్పంచ్ గౌతమి, ఉప సర్పంచ్ మురళిరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతి



తిరుపతి ఎడ్యుకేషన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో అక్టోబరు 26వ తేదీన నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఎస్వీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని సి.చంద్రిత ప్రథమ, పదో తరగతి విద్యార్థిని బి.రేష్మి తృతీయ స్థానాలు సాధించారు. అలాగే వ్యాసరచన పోటీల్లో పదో తరగతి విద్యార్థి ఎస్.తరుణ్‌కుమార్ ద్వితీయ స్థానం సాధించాడు. వారికి ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి బుధవారం రూ.5 వేలు, రూ.2 వేలు, రూ.3 వేల నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళి



మాతయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: మండలంలోని రాయలపురం మాజీ సర్పంచ్ పాట్లూరి మాతయ్య(68) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం వారి నివాసం వద్దకు చేరుకున్నారు. మాతయ్య భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, కత్తి నాగార్జున తదితరులు ఉన్నారు.


చిరస్మరణీయుడు పొట్టిశ్రీరాములు

చంద్రగిరి: తెలుగుజాతి ఉన్నంత కాలం చిరస్మరణీయుడిగా నిలిచిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌బాబుతో కలసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ శశిరేఖ, ఏవో రవిచంద్ర పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛను పంపిణీ



చంద్రగిరి: కిడ్నీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న అగరాల పంచాయతీ బండకాడపల్లికి చెందిన సెల్వంకు బుధవారం సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, వలంటీర్ మునిరాజతో కలిసి ఆస్పత్రిలో పింఛను మొత్తం అందజేశారు. కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి మరింత మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని అతనికి భరోసా ఇచ్చారు. ఆస్పత్రికే వచ్చి పింఛను మొత్తం ఇవ్వడంపై సెల్వం భార్య లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. అశోక్, సోము పాల్గొన్నారు.



అత్యాధునిక వసతులతో పీహెచ్‌సీ

- భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం : తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పీహెచ్‌సీ సిబ్బందితో ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. పాకాల సమీపంలో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పాకాల పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తుడా నిధులు రూ.1.85 కోట్లతో కొత్త భవనం నిర్మించినట్టు చెప్పారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించి మందులు అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

అత్యాధునికంగా పీహెచ్‌సీ భవనం..

పీహెచ్‌సీ భవనంలో ఇద్దరు వైద్యాధికారుల గదులు, రిజిస్ట్రేషన్ గది, వెయిటింగ్, మీటింగ్ హాల్స్, టీకాలు వేసే గది, డెలివరీ రూము, ఆపరేషన్ గది, వైద్య పరికాలు శుభ్రపరిచే గది, సిబ్బంది కోసం ప్రత్యేకంగా గదులు నిర్మించారు. రోగులు బయట కూర్చోవడానికి రచ్చబండలు నిర్మిస్తున్నారు. ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, 30 మంది సిబ్బందితో వైద్య సేవలు అందించనున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, వల్లివేడు విక్రమ్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, రఘుపతి, సర్పంచులు వసంత, కస్తూరి, కళావతి, నాని, ఎంపీటీసీలు గౌతమి, శ్యామల, కపిలేశ్వర్‌రెడ్డి, రహీం, శివప్రసాద్, పవన్‌కుమార్, నరసారెడ్డి, డీఎం అండ్ హెచ్ఓ శ్రీహరి, ఎంపీఈఓ ప్రభాకర్, డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం..

పాకాల : దామలచెరువు పంచాయతీ ఊటువంకలో సీసీ రోడ్డును బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఊటువంక గ్రామానికి గత 75 ఏళ్లుగా రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పర్యటించినప్పుడు రోడ్డు వేయాలని గ్రామస్తులు విన్నవించారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తుడా నిధులు రూ.35 లక్షలు వెచ్చించి రోడ్డును నిర్మించారని చెప్పారు. స్థానికులు మాట్లాడుతూ తమకు మేలు చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, రఘుపతి, భాస్కర్‌నాయుడు, రహీం, హసీనా, కరుణాకర్, కిరణ్, హేమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసం విప్లవాత్మక మార్పులు



వైద్య పరీక్షలు చేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని తాతయ్యగుంట అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానికులకు స్వయంగా వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులను చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి సర్వే చేసి అనారోగ్య సమస్యలు ఉంటే మెడికల్ క్యాంపుల ద్వారా మెరుగైన వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. వ్యాధి తీవ్రంగా ఉన్నట్టు గుర్తిస్తే డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించనున్నట్టు వివరించారు. ఈ నెల 7వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీస్ డాక్టర్ నరేంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా భరణి యాదవ్, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, శేఖర్, అధికారులు రవి, హరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి మోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు



చంద్రగిరి: తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం రామిరెడ్డిపల్లి పంచాయతీ నాగయ్యగారిపల్లి హరిజనవాడలో నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఆలయ కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. బుధవారం కలశాభిషేకం, హోమాలు చేశారు. ఇందులో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీటీసీ రాజయ్య పాల్గొన్నారు.

రమాదేవిలో విజయవంతంగా ప్లాస్టిక్ సర్జరి



ప్లాస్టిక్ సర్జరీ అనంతరం బాధితుడితో వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీ రామాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీని వైద్యుల బృందం విజయవంతంగా పూర్తి చేసినట్టు ఎండీ డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు రూరల్ పంచగుంటకు చెందిన భానుప్రసాద్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని తెలిపారు. అతనికి వివిధ వైద్య పరీక్షలు చేసి 90 శాతం వరకు శరీరం కాలిపోయినట్టు గుర్తించామన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడికి మెరుగైన చికిత్స ఉందించి ప్రాణాలు కాపాడామన్నారు. కాలిన గాయాలకు పలుమార్లు ప్లాస్టిక్ సర్జరీ చేశామన్నారు. ప్రస్తుతం బాధితుడు కోలుకున్నాడని చెప్పారు. లక్షలతో కూడుకున్న ప్లాస్టిక్ సర్జరీని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్టు వివరించారు. బాధితుడి కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నేత ఈశ్వర్ రెడ్డికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శ



ఈశ్వర్‌రెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డిని ఓదార్చుతున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకువెళ్లే నాయకుడని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మరోసారి రుజువు చేసుకున్నారు. టీడీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి కోడలు లీలావతి ఇటీవల ప్రసవం సమయంలో మృతిచెందారు. పెరుమాళ్లపల్లిలోని ఈశ్వర్‌రెడ్డి నివాసం బుధవారం కర్మక్రియలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అతని కొడుకు చరణ్ రెడ్డికి ధైర్యం చెప్పారు. అక్కడే భోజనం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జోగి మోహన్, ఉపసర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యంపై పట్టు సాధించాలి

తిరుపతి సిటీ: యువత, అధ్యాపకులు సాహిత్యంపై పట్టు సాధించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సంస్కృత విద్యాలయంలో బుధవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యంపై పట్టుసాధించి విద్యార్థులను ఆ దారిలో నడిపించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఆర్థిక, సామాజిక రంగాలను సాహిత్యం ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత రామసూర్యనారాయణ మాట్లాడుతూ సాహిత్యం కఠినమైన విషయాలను సరళంగా ఉద్భవింపజేసే ఒక శాస్త్రమన్నారు. విద్యార్థులు సాహిత్య విషయాలను గ్రహించాలన్నారు.

గాల్లో తేలిపోదాం..

- హెలీ టూరిజం సేవలు ప్రారంభం
- ఈ నెల 7వ తేదీ వరకు జాయ్‌రైడ్



తుమ్మలగుంటలోని హెలీప్యాడ్ నుంచి ప్రారంభమైన హెలీకాప్టర్ జాయ్‌రైడ్

తిరుపతి రూరల్: ఆకాశయానం ద్వారా తిరుపతి, చంద్రగిరి అందాలను వీక్షించేందుకు ఎరోడాన్ సంస్థ హెలీ టూరిజం సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. తుమ్మలగుంటలోని కేవీఎస్ క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్ జాయ్ రైడ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ అవకాశం 7వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఒక వ్యక్తికి రూ.6 వేల చార్జీని వసూలు చేస్తారు. తుమ్మలగుంట హెలీప్యాడ్ నుంచి తిరుపతి మీదుగా చంద్రగిరి కోటతో పాటు చుట్టుపక్కల 10 నిమిషాలు రైడ్ కొనసాగుతుందని ఎరోడాన్ సంస్థ ప్రతినిధి సుకుమార్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ హెలీకాప్టర్ జాయ్ రైడ్ అందుబాటులో ఉంటుందన్నారు. బుకింగ్ కోసం 9003077710 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేర్లను సరిచూసుకోండి

తిరుపతి తుడా: ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేరును సరిచూసుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ http://voters.eci.in లో లాగిన్ అయి పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని తెలిపారు. పేరు లేకుంటే ఫారం-6ను, వివరాలు తప్పుగా ఉంటే ఫారం-8, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు ఫారం-7 ఇవ్వాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు కోసం ఫారం-6ను ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా వెబ్‌సైట్ లేదా బీఎల్‌వో ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

భూముల ఆక్రమణపై ఫిర్యాదు

చంద్రగిరి: ఏళ్ల తరబడి ఆలయానికి వెళ్తున్న దారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లి గ్రామస్తులు కోరారు. వారు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పనపాకం లెక్కదాఖలా సర్వే నంబరు 838/3లో 1996లో ప్రభుత్వం లేఅవుట్ వేసి పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అందులో వీధిని దుర్వాసులు అనే వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్నారని వాపోయారు. దీంతో శివాలయానికి దారిలేకుండా పోతోందని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై దుర్వాసులు మాట్లాడుతూ తనకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా ప్రకారమే నిర్మాణాలు చేస్తున్నానని చెప్పారు.

నా భూమిని కాపాడండి

ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఉన్న భూములను కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని ఎం.కొత్తపల్లికి చెందిన దళిత రైతులు కోరారు. వారు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎం.కొత్తపల్లి లెక్కదాఖలా సర్వే నంబరు 774/1 పేం, ఇ 774/5 వరకు 1996లో ఏడుగురు దళితులకు 15.42 ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 774/1లోని భూమి పక్కన ఉన్న 50 సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, దానిపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు.

వేమూరులో గుజరాత్ రైతులు



జీవామృతం తయారీపై గుజరాత్ రైతులకు అవగాహన కల్పిస్తున్న అయప్పనాయుడు

తిరుపతి రూరల్: మండలంలోని వేమూరులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం గుజరాత్ రైతులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు దామ అయ్యప్పనాయుడు పొలాలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న దేశవాళి వరి ఏ-గ్రేడ్ మోడల్ పద్ధతి, మల్బరీ, మామిడి తోటల్లో అంతర పంటల సాగు విధానాన్ని పరిశీలించారు. ఆత్మ పథకం కింద రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గుజరాత్ రైతులు వేమూరును సందర్శించారు. వారికి అయ్యప్పనాయుడు డ్రిప్ సిస్టం ద్వారా జీవామృతం సరఫరా చేయడం, కషాయాలు, ఘన జీవామృతం తయారీ తదితర ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. గుజరాత్ రాష్ట్ర ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ విమల్ పటేల్, రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. రాస్ వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

తిరుపతి సిటీ : సేంద్రియ సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై జాతీయ స్థాయి శిక్షణను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు సమీకృత వ్యవసాయం, సేంద్రియ పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార భద్రత సమస్య ఉత్పన్నం కాకుండా శాస్త్రవేత్తలు అంకుర సంస్థలు దృష్టి సారించాలని సూచించారు. ఏడీఆర్ సి.రమణ మాట్లాడుతూ తమిళనాడు, ఏపీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 37 మంది శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొనడం శుభపరిణామన్నారు. ఐసర్ డైరెక్టర్ శాంతనుభట్టాచార్య, ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి, పీవీ సత్యగోపాల్, కృష్ణారెడ్డి, శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి పాల్గొన్నారు.

యువతకు కళారంగ అవకాశాల వేదిక మిత్ర ఎంటర్‌టైన్‌మెంట్



సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న నటీ నటులు

తిరుపతి కల్చరల్: యువతకు కళారంగంలో అవకాశాలు కల్పించేందుకు చక్కటి వేదిక మిత్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అని పలువురు తెలిపారు. బైరాగిపట్టెడలోని మిత్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ కార్యాలయంలో బుధవారం ఆ సంస్థ లోగోను జీ తెలుగులో ప్రసారమవుతున్న శుభస్య శ్రీఘ్రం సీరియల్ హీరో మహేష్‌బాబు కాళిదాసు, నటీమణి సుహాసిని జయచంద్రన్, మిస్ ఇండియా ఐకానిక్ దివా-2023 విజేత భావన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిత్ర ఎంటర్‌టైన్‌మెంట్ చైర్మన్ గోపీకృష్ణ, మహిళా వర్సిటీ బయోటెక్నాలజీ హెచ్‌వోడీ జ్యోత్స్న, కళాకారులు శాంభోలు హరినాథ్, కామిడీ శాస్త్రి పాల్గొన్నారు.

‘శ్రీరామ’లో కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ: తిరుపతి-కరంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఇందులో 250 కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. శ్రీసత్యసాయి జిల్లా చిగిచెర్లలో అక్టోబర్ 25 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు కె.భవ్య బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. అలాగే మరో విద్యార్థిని విద్యావర్షిని కాంస్య పతకం సాధించింది. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. కృష్ణా జిల్లాలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో ఎ.చైతన్య వెండి పతకం సాధించాడు. విద్యార్థులను బుధవారం స్థానిక కార్పొరేటర్ తూకివాకం షాలిని మహేష్‌రెడ్డి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు క్రీడలు చాలా ముఖ్యం

తిరుపతి సిటీ: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కళాశాలలో బుధవారం హాకీ, ఫుట్‌బాల్, బాల్ బాడ్మింటన్, టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు హాకీలో విజేతగా నిలిచింది. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శరీరదారుఢ్య కలుగుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై మక్కువ చూపాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పీఈటీ ముస్తాక్ అహ్మద్, అధ్యాపకులు భీమన్న, కిరణ్‌కుమార్‌రాజు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న పురందేశ్వరి

తిరుపతి గాంధీ రోడ్డు: ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పేర్కొన్నారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బుధవారం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. రాయలసీమకు సంబంధించిన గండికోట నిర్మాణాన్ని పూర్తి చేయలేదని ఆరోపించారు. తుంగభద్ర నుంచి 29 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నా 10 టీఎంసీల వరకే తీసుకుంటున్నామన్నారు. భాను ప్రకాష్ రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పాల్గొన్నారు.

శ్రీశక్తి పీఠంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో వెలసిన శ్రీశక్తి పీఠాన్ని బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి శ్వేత వారాహీ దేవి, మరకత కాళీదేవి అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం శ్రీశక్తి పీఠ వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆశీస్సులు పొందారు.

వరల్డ్ కప్పు నమూనా ప్రదర్శన



తిరుపతి కల్చరల్: వరల్డ్ కప్పు క్రికెట్ పోటీల్లో భారత్ జట్టు విజయం సాధించాలని హోటల్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు చిల్లీస్ రెస్టారెంట్ అధినేత వీరాంజనేయులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ వద్ద బుధవారం మూడు అడుగుల క్రికెట్ వరల్డ్ కప్పు నమూనాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ వరల్డ్ కప్పు క్రికెట్ పోటీల్లో భారత్ విజయం దిశగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అంతకుముందు మూడు అడుగుల వరల్డ్ కప్పు నమూనాను నగరంలో ప్రదర్శించారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పాకాల: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అనంత ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో బుధవారం రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆటో డ్రైవర్ వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వనజ, యోగనాశ్రీ స్వల్పంగా గాయపడ్డారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన వారిని పాకాల పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

